క్లుప్తంగా

పదోన్నతులు కల్పించాలి



చిల్పూరు: పదోన్నతులు కల్పించాలని భాషా పండితుల జేఏసీ రాష్ట్ర నాయకులు చక్రవర్తులు శ్రీనివాస్, జనగామ జిల్లా అధ్యక్షుడు ముల్కనూర్ శంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని పల్లగుట్టలో శుక్రవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో వివిధ పాఠశాలలకు చెందిన భాషా ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పల్లగుట్ట స్కూల్ కాంప్లెక్స్ ఆర్పీ బత్తిని లక్ష్మీ, మచ్చిపెల్లి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కొడకండ్ల: సీజనల్ వారీగా వ్యాధుల ప్రబలకుండా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని పశువులకు టీకాలు, చికిత్సలు చేయించుకొవాలని సర్పంచ్ పసునూరి మధుసూదన్ కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో నిర్వహించిన గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించి, పాడిరైతులకు మందులు పంపిణీ చేశారు. ఏడీ చంద్రమౌళి, డాక్టర్లు మనోహర్, నర్సయ్య, సారంగపాణి, శ్రీనాథ్, నరేష్ పాల్గొన్నారు.

'జంగా' జన్మదినం సందర్భంగా పూజలు

జనగామ రూరల్: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పట్టణ యూత్ అధ్యక్షుడు ఆసీఫ్ ఖాన్ ఆధ్వర్యంలో దుర్గమ్మ దేవాలయంలో కార్యకర్తలు పూజలు నిర్వహించారు. నక్ర నవీన్, రామగళ్ల అభినయ్, అజయ్, అఖిల్, ఉదమ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీకి విరాళం

దేవరుప్పుల : మండలంలోని కడవెండి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ నిర్వహణకు అబ్బురపడిన స్థానిక యువకుడు కొడగాని రఘుజీ రూ.5వేల చెక్కును సర్పంచ్ బెల్లీనా లీనారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రమేష్, మార్కెట్ డైరెక్టర్ భిక్షపతి, బక్కాజీ, కొమురయ్య, సోమన్న, సుధాకర్, రాంబాబు, వీరాస్వామి, లక్ష్మీనారాయణ, మల్లయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

పాడి గేదె మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: ఛాగల్లులోని రైతు గాండ్ల సమ్మయ్యకు చెందిన పాడిగేదె పాముకాటుతో శుక్రవారం మృతిచెందింది. బాధిత రైతు సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న సమ్మయ్య రోజూ మాదిరిగానే గురువారం సాయంత్రం తన వ్యవసాయ భూమి కొట్టం వద్ద గేదెను కట్టేశాడు. శుక్రవారం తెల్లవారుజామున వెళ్లి చూడగా పాడిగేదె మృతిచెంది ఉంది. గేదె నోటి నుంచి వచ్చిన నురుగును గుర్తించి పాముకాటుతో మృతిచెందినట్లు రైతులు భావిస్తున్నారు.

సర్పంచ్‌కు పరామర్శ

కొడకండ్ల: మండలంలోని బోడోనికుంటతండా సర్పంచ్ బానోత్ సోమాని కుటుంబసభ్యులను శుక్రవారం డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. సోమాని భార్య కమల ఇటీవల మృతి చెందగా కేవీర్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, ఎంపీపీ జ్యోతి, జెడ్పీటీసీ సత్తమ్మ, రాజిరెడ్డి, మధుసూదన్ ఉన్నారు.

'ఆరోపణలు అవాస్తవం'

రఘునాథపల్లి: తనపై అక్రమ పట్టా ఆరోపణలు అవాస్తవమని మహమ్మద్ అమీనాబి అలియాస్ నజీమాబి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని గోవర్ధనగిరిలో తనకు వారసత్వంగా సర్వేనంబర్ 142/ఏ/2లో 0–20 గుంటలు సక్రమించగా రెవెన్యూ అధికారులు తనకు పట్టా చేశారన్నారు. భూమిని తన సోదరుడు దక్కించుకోవాలని కుట్రలు పన్నుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు. అదే విధంగా తన తల్లిదండ్రుల 12–20 ఎకరాల భూమిలో తనకు రావాల్సిన భూమి కోసం కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రఘునాథపల్లి: కోమళ్లలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి నగదు, బంగారు, వెండి అభరణాలు అపహరించిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. రఘునాథపల్లి ఎస్సై వీరేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వెల్పుగొండ అశోక్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న తన తల్లి బుచ్చమ్మను ఈ నెల 4న కుటుంబ సభ్యులతో కలిసి సికింద్రాబాద్ లాలాగూడ రైల్వే ఆస్పత్రిలో అడ్మిట్ చేసేందుకు వెళ్లాడు. శుక్రవారం బియ్యం తీసుకెళ్లేందుకు ఇంటికి రాగా.. ఇంటి తాళం, ఇంట్లోని బీరువా తాళం పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఇంట్లో బీరువాలో ఉన్న నగదుతో కలిపి రూ.2.70లక్షలు అపహరించినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- ఎంపీపీ రడపాక సుదర్శన్
- ఘనంగా కూనూర్ పాఠశాల వార్షికోత్సవం



పాఠశాలలో వార్షికోత్సవ నివేదికను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, ఉపాధ్యాయులు, తదితరులు

జఫర్‌గఢ్: అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంపీపీ రడపాక సుదర్శన్ కోరారు. మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం ఎండీ పర్వేజ్ అధ్యక్షత వహించగా ఎంపీపీ సుదర్శన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలను అన్ని విధాల అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అత్యధికంగా గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. చదువు ద్వారానే అన్ని సాధించడంతో పాటు ముఖ్యంగా పేదరికాన్ని జయించవచ్చునన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కూనూర్ విద్యార్థులు పోటీ పరీక్షలల్లో మంచి ప్రతిభను కనబరుస్తున్నట్లు తెలిపారు. ఇదే ప్రతిభను కొనసాగించి పాఠశాలకు మంచి పేరు తీసుకరావాలన్నారు. అనంతరం పాఠశాల వార్షికోత్సవ నివేదికను అవిష్కరించడంతో పాటు విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి, సర్పంచ్ ఇల్లందుల కుమార్, ఎంపీటీసీ సభ్యులు సంధ్యశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ఘనత కేంద్రానిదే..

- మాజీ ఎమ్మెల్యే ధర్మారావు



పాలకుర్తిలో ప్రసంగిస్తున్న ధర్మారావు



ప్రదీప్‌రావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పాలకుర్తి: రాష్ట్రంలో అత్యధిక పనులు చేసిన ఘనత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదేనని మాజీ ఎమ్మెల్యే ధర్మారావు అన్నారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా గోస, శక్తి కేంద్రంలో బీజేపీ కార్నర్ కార్యక్రమంలో భాగంగా మండల అధ్యక్షుడు దొంగరి మహేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ధర్మారావు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లేగ రాంమోహన్ రెడ్డి, కర్రె శ్రీనివాస్ రెడ్డి, సొడ రమేష్, దామోదర్‌రెడ్డి, సోమయ్య, నిరంజన్ రెడ్డి, రవికుమార్, దుంపలి సంపత్, సోమేశ్వర్, వెంకన్న, నజీర్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన..

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిరంకుశ, నియంత పాలన సాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ప్రజాగోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మండలంలోని శివునిపల్లి వివేకానందచౌరస్తా వద్ద శుక్రవారం శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జ్, బీజేపీ మండల అధికార ప్రతినిధి బూర్ల విష్ణుమదిరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రదీప్‌రావు మాట్లాడారు. సీఎం కేసీఆర్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. కేసీఆర్ మాయమాటలతో ప్రజలను దగా చేస్తున్నారని, తెలంగాణలో రైతులు, నిరుద్యోగుల ఆత్మహత్యలు, భూకబ్జాలు, మహిళలపై అరాచకాలు అధికమయ్యాయన్నారు. రైతుబంధు పేరు చెప్పి వ్యవసాయ సబ్సిడీలను బంద్ చేశారని తెలిపారు. ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే తమ్ముడు, ఘన్‌పూర్ సర్పంచ్‌కు దళితబంధు ఇవ్వడమే వారి అవినీతికి నిదర్శమన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, వేముల అశోక్, ఐలోని అంజిరెడ్డి, యుగేందర్‌రెడ్డి, గట్టు కృష్ణ, సుభాష్, ప్రభాకర్, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

అంజయ్య స్వామికి సత్కారం



జనగామ: అధ్యాత్మిక రంగంలో విశేష సేవలు అందిస్తూ.. ఇటీవల డాక్టరేట్ పట్టా అందుకున్న యాదాద్రి జిల్లా కైలాసపురం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ అర్చకులు వంగపల్లి అంజయ్య స్వామి భక్తులు ఘనంగా సత్కరించారు. శుక్రవారం కొత్తపల్లి కాశీపతి, బిజ్జాల నవీన్‌గుప్తా, కొత్తపల్లి రాజయ్య, అరుగుల శ్రీనివాస్ తదితలు శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆలయ 27వ వార్సికోత్సవం పురస్కరించుకుని, స్వామీజీకి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ నెల13న ఆలయం ప్రాంగణంలో శ్రీ రేణుకజమదగ్ని కల్యాణ మహోత్సవ వేడకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

గొడుగుల పంపిణీ



గొడుగులు అందజేస్తున్న ప్రతినిధులు

దేవరుప్పుల: మండల కేంద్రంలోని చిరు వ్యాపారులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు. శుక్రవారం లయన్ నరహరి సుధాకర్‌రెడ్డి జీఇటి కోఆర్డినేటర్(320ఎఫ్ హెసి హనుమకొండ) సౌజన్యంతో వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీపై పలువురు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గద్దం సత్య నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈదునూరి రామచంద్రారెడ్డి, కోశాధికారి గోలి ఉప్పల్ రెడ్డి, కన్వీనర్ మర్రి పట్టాభి రామిరెడ్డి, సభ్యులు బూత్కూరి అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

బోధించాలంటే చదవాల్సిందే..



విద్యార్థులతో ఉపాధ్యాయులు

రఘునాథపల్లి: విద్యార్థులకు పాఠాలు బోధించాలంటే ఉపాధ్యాయులు నిత్యం చదవాల్సిందేనని ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు అభిప్రాయపడ్డారు. మండలంలోని మండెలగూడెం ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా 15 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా హెచ్ఎం డాక్టర్ భారత రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు విద్యాబోధనలో తమ అనుభవాలను వివరించారు. అనంతరం సర్పంచ్ ఉత్తెపు ఉమారాణి మాట్లాడారు. స్వయం పాలనతో విద్యార్థుల్లో నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. ఇదిలా ఉండగా.. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రామమోహన్, విజయలక్ష్మి, శ్రీను, అనిల్‌కుమార్, ఉత్తెపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వేడుకల్లో డీఈఓగా వినోద్‌కుమార్, హెచ్ఎంగా ఆకుల సూరజ్‌కుమార్, పీఈటీగా కార్తీక్, ఆఫీస్ సబార్డినేట్‌గా రాము సమర్ధవంతగా విధులు నిర్వహించి, ప్రశంసలు అందుకున్నారు.

జన్మనిచ్చిన తల్లిదండ్రులను విస్మరించొద్దు



పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్‌గౌడ్

దేవరుప్పుల : జన్మనిచ్చిన తల్లిదండ్రులను విస్మరించొద్దని బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. శుక్రవారం మండలంలోని సీతారాంపురం అనాథ శరణాలయంలో తన జన్మదిన వేడుకలను నిర్వహించుకుని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, స్వీట్లు పంపిణీ చేసి అన్నదానం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అనాథ వృద్ధులకు కన్న పిల్లల వలే విస్తృత సేవలందిస్తున్న నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనాథలకు సేవలందించే కార్యక్రమంలో తనవంతు సహకారం నిరంతరం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బబ్బూరి నాగరాజు, మమత, అనూష, నిర్వాహకులు మారోజు బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు : ఏసీపీ



ఆలయ అధికారులకు సూచనలు ఇస్తున్న ఏసీపీ

బచ్చన్నపేట: కొడవటూరులోని స్వయంభూ శ్రీ సిద్ధేశ్వరాలయంలో శివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు జనగామ ఏసీపీ దేవేందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం నర్మెట సీఐ నాగబాబుతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అగ్నిగుండాలు, శివకళ్యాణం నిర్వహించే స్థలాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఏసీపీ మాట్లాడుతూ.. భక్తులు ఆటోల్లో కిక్కిరిసి రావొద్దని, డ్రైవర్ పక్కన ఇరువైపులా కూర్చోవద్దని సూచించారు. భక్తుల సౌకర్యార్థం విచారణ కేంద్రాన్ని ప్రారంభించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి, ఎస్సై సృజన్‌కుమార్, ఆలయ ఈఓ చిందం వంశీ, ప్రధాన పూజారి ఓం నమఃశివాయ, ఆలయ అధికారులు చల్ల రాజేందర్‌రెడ్డి, మధు, క్రాంతి, భానుచందర్ రెడ్డి పాల్గొన్నారు.

నల్లబెల్లం, పటిక స్వాధీనం

- ముగ్గురి అరెస్ట్.. ఇద్దరి పరారీ



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

జనగామ: కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి మహబూబాబాద్ జిల్లాకు నల్లబెల్లం, పటిక తరలిస్తున్న వాహనాలను ఎక్సైజ్ శాఖ అధికారులు మాటు వేసి పట్టుకున్నారు. వరంగల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.నాగేందర్‌రావు ఆదేశాల మేరకు వరంగల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, మాధవీలత ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారు జాము వరంగల్– హైదరాబాద్ జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లైన్ తండాకు చెందిన ఐదుగురు వ్యక్తులు బొలెరో, ఆటో వాహనంలో కర్ణాటక రాష్ట్రం నుంచి నల్లబెల్లం, పటిక తరలిస్తున్నారన్నారు. 33 వందల కిలోల బెల్లం, 250 కిలోల పటిక, 50 లీటర్ల గుడుంబాతో పాటు రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నల్లబెల్లం, పట్టిక తరలిస్తున్న బానోతు సురేష్ అలియాస్ భద్రు, బి.నర్సింగ్, కుమాన్ సింగ్‌లను అదుపులోకి తీసుకోగా. బానోతు సురేష్ అలియాస్ ఈరు, జె.నరేష్ పరారీలో ఉన్నట్లు వివరించారు. తనిఖీల్లో వరంగల్ ఎక్సైజ్ ఎస్సై ఎం.కిషోర్‌బాబు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రజిత, ఈసీలు హరిబాబు, సురేష్, వెంకన్న, వెంకటస్వామి, వీరస్వామి, సుమన్ పాల్గొన్నారు.

గుడిసెలను కాల్చిన వారిపై చర్య తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న గుడిసె వాసులు

తరిగొప్పుల: ప్రభుత్వ భూమిలో దళితులు వేసుకున్న గుడిసెలను కాల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని మహాత్మా జ్యోతిరావు పూలే నగర్ గుడిసె వాసుల సంఘం తరిగొప్పుల గ్రామ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం వారు నిరసన తెలిపిన అనంతరం మాట్లాడారు. గ్రామకంఠం సర్వే నంబర్ 844లోని ప్రభుత్వ భూమిలో నిరుపేద బహుజనులు ఇటీవల గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు గుడిసెలను వదిలిరావడం జరిగిందన్నారు. సోలిపూర్ గ్రామానికి చెందిన పింగిళి నరేందర్‌రెడ్డి సదరు భూమిలో సాగు చేస్తున్నాడని, అతనే తాము వేసిన గుడిసెలను రాత్రికి రాత్రే కాల్చివేశాడని తెలిపారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన వ్యక్తికి పోలీసులు భద్రత కల్పించడం ప్రజాస్వామ్య హక్కులను కించపరచడమే అన్నారు. భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని అర్హులైన నిరుపేద బహుజనులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దామెర దాసు, మైకేల్, చింతల ఆనందం, వెంకటేష్, కాత రామయ్య, చింతల భాస్కర్, దానియేలు, యాటెల్లి సుదర్శనం, గాలయ్య, సునంద, సుధాకర్, వినయ్, స్వామి పాల్గొన్నారు.

జీఎంపీఎస్ మండల కమిటీ ఎన్నిక



రాజశేఖర్



ప్రభాకర్

చిల్పూరు: గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల నూతన కమిటీని మండల కేంద్రంలో సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బొల్ల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా వెంకటాద్రిపేట ఎంపీటీసీ ఎన్నకూస కుమార్, మండల అధ్యక్షుడిగా భూయ్య రాజశేఖర్, కార్యదర్శిగా అవుల ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా గాలి ప్రవీణ్, సహాయ కార్యదర్శిగా దాసరి కుమార్, కోశాధికారిగా అసరి రాజయ్య, మండల కమిటీ సభ్యులుగా అపారదాపు రాజు, బుర్ర కోటిలింగం, గుంటి భీమయ్య, లొడెం అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గొల్ల,కురుమల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. తమ ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు యాకయ్య

రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ యజమానులు శుక్రవారం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడిగా ద్యావర యాకయ్య, గౌరవ అధ్యక్షుడిగా పోకల శివకుమార్, ఎండీ బాషుమియా, ఇన్మారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండీ మోహిన్, ప్రధాన కార్యదర్శి బొల్లం రాజీవ్, కార్యదర్శి మురళి, ప్రచార కార్యదర్శి ఇమ్మడిశెట్టి హరి, కార్యవర్గ సభ్యులుగా యాకుబ్, ఆనంద్‌రెడ్డి, రాములు, పాషా, ఐలయ్య, శేఖర్, సురేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉత్తమ ఫలితాలతో ఆదర్శంగా నిలవాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ జ్యోతి

కొడకండ్ల: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి, ఆదర్శంగా నిలవాలని ఎంపీపీ జ్యోతి సూచించారు. శుక్రవారం జెడ్పీటీసీ సత్తమ్మతో కలిసి ఎంపీపీ గిర్నితండాలోని మహత్మజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కూరగాయలు, వస్తు సామగ్రి, భోజనాన్ని వారు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజ్‌కుమార్, నోడల్ ఆఫీసర్ గ్రేస్ కేజీయారాణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

వాలంటైన్స్ దేను బహిష్కరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: మన సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధమైన వాలంటైన్స్ డేను బహిష్కరించాలని కులాంతర వివాహదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పెసరు సారయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం పేరిట మన సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించొద్దన్నారు. ఈ నెల 14న వీరజవాన్ల దినోత్సవం ఉందని, ప్రేమికుల దినోత్సవ వేడుకలను బహిష్కరించి, పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లను స్మరిస్తూ నివాళులర్పించాలని ఆయన కోరారు.

గ్రామ శాఖలే పార్టీలకు పునాదులు

చిల్పూరు: గ్రామశాఖలే పార్టీలకు పునాదులని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు తాళ్లపల్లి బుచ్చయ్య అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాలలో శుక్రవారం మండల పార్టీ అధ్యక్షుడు గడ్డమీది సురేష్ ఆధ్వర్యంలో గ్రామ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఇల్లందుల యాదగిరి, ఉపాధ్యక్షుడిగా భూక్య సోయ ను నియమించారు. సమావేశంలో తౌటి సునీల్, యాదవరెడ్డి, బుచ్చికొంరయ్య, బాలరాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చిల్పూర్: మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన యావగోని తోట కొంరయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ అభివృద్ధి దాత, చిల్పూరు గుట్ట ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు చిర్ర నాగరాజుతో రూ. 5వేలు ఆర్థిక సాయం పంపారు. అంత్యక్రియలకు ఆదుకున్న శ్రీధర్‌రావును సర్పంచ్ బొట్టు మానస, నాయకులు చల్లారపు శ్యాంసుందర్‌రెడ్డి, చిర్ర రాజమౌళి, మేరుగు చంద్రమౌళి, ఉప సర్పంచ్ బత్తిని శ్రీనివాస్, దార అశోక్‌పాల్, జీడి జాన్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

పండ్ల మొక్కల పంపిణీ

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి జన్మదినం సందర్భంగా డివిజన్ కేంద్రంలో పార్టీ జిల్లా నాయకుడు బాణాల రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పండ్ల చెట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, సుమన్‌నాయక్, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

నిరుపేదలకు బాసటగా సీఎంఆర్ఎఫ్

దేవరుప్పుల: నిరుపేదలకు బాసటగా సీఎం సహాయనిధి దోహదపడుతుందని సర్పంచ్ మలిపెద్ది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నీర్మాలలో రూ.25వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును లబ్ధిదారు పొదల రేణుకకు అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ జలంధర్ రెడ్డి, సుందర్ రాంరెడ్డి, వెంకటేష్, విద్యాసాగర్, మల్లారెడ్డి, వడ్లకొండ యాదయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

షర్మిల పాదయాత్రలో మండల శ్రేణులు

దేవరుప్పుల: ఖిలాషాపురం మీదుగా కొనసాగే వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్రలో మండల శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీహరి మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారానికి చేపట్టే యాత్రలతో పాలకవర్గాల్లో గుబులు మొదలైందన్నారు. కార్యక్రమంలో గుగులోతు వెంకన్న, పోగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

పుస్తకాల పంపిణీ

పాలకుర్తి: మండలంలోని ఈరవెన్ను ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మహాత్మా హెల్పింగ్ హ్యాండ్ సంస్థ ఆధ్వర్యంలో పుస్తకాలను అందజేశారు. గంట రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతన పెంపు హర్షణీయం

స్టేషన్‌ఘన్‌పూర్: మధ్యాహ్న భోజన కార్మికులకు సీఎం కేసీఆర్ వేతనాలను రూ.3వేలకు పెంపు చేయడం హర్షణీయమని టీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం అన్నారు. డివిజన్ కేంద్రంలో మధ్యాహ్నభోజన కార్మికులు సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఖలీదాబేగం, రంగమ్మ, రజిత, విజయ, కవిత, స్వరూప, నాగమ్మ, ఎల్లమ్మ, భద్రమ్మ, రజిత, ప్రమీల, భాగ్యమ్మ, లక్ష్మీ, కవిత పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి



కేంద్రమంత్రికి వినతిపత్రం సమర్పించిన నాయకులు

కొడకండ్ల: బీసీ కుల గణనపై పార్లమెంట్‌లో చర్చించి త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్‌ను తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బొమ్మగాని విక్రంగౌడ్ ఆధ్వర్యంలో దేశగాని నాగరాజుగౌడ్, వెంకన్న, తండ రమేష్, నక్క అశోక్ తదితరులు పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో శుక్రవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

రిజర్వేషన్ కల్పించాలి

రఘునాథపల్లి: ఆర్యవైశ్యులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర టూరిజం చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఈ విషయమై త్వరలో సీఎం కేసీఆర్‌కు కలవనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, రఘునాథపల్లి సర్పంచ్ పోకల శివకుమార్ స్వగృహంలో శుక్రవారం నిర్వహించారు. ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదిగేందుకు శ్రీనివాస్‌గుప్తా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఈ సందర్భంగా శివకుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆరూరి శ్రీనివాస్, జెరిపోతుల మహేందర్, ప్యారపు రాములు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: తమ ఫ్లెక్సీలు, పోస్టర్లు ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కౌన్సిల్ చైర్మన్ రాజారావు ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాను, తన కుమారుడు జీవజ్యోతి వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ రాజారపు ప్రభుదేవా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందుకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పోస్టర్లను ఘన్‌పూర్‌లో కొందరు ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారని పేర్కొన్నారు. గతంలోనూ కొందరు ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని, ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

స్నానానికని వెళ్లి.. శవమై తేలాడు



బాలయ్య మృతదేహం

బచ్చన్నపేట: స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మండలంలోని లింగంపల్లికి చెందిన నాగపురి బాలయ్య(75) మృతి చెందాడు. వృద్ధుడు అప్పుడప్పుడు ఇంటి సమీపంలోని వ్యవసాయ బావి వద్ద బట్టలు ఉతుక్కుని స్నానం చేసి వచ్చేవాడు. ఎప్పటి మాదిరిగానే ఈనెల 9న(గురువారం) మధ్యాహ్నం ఇంట్లో చెప్పి వెళ్లిన బాలయ్య సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. అనుమానం వచ్చిన కుటుంబీకులు సాయంత్రం బావి వద్ద చూడగా బట్టలు చెట్లపై ఆరేసి ఉన్నాయి. బావిలో చెప్పులు, చేతికర్ర కనిపించాయి. శుక్రవారం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మోటార్లతో బావిలో నీటిని తోడారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టు మార్టానికి పంపించారు. కేసు నమోదు చేసుకున్నారు.